నిత్యాగ్నిహోత్రంలా
గడపాల్సిన జీవితాన్ని
నాగరికతతో
అతను కల్మషం
చేసుకోడానికి కారణం?

# రాగిచెంబు

గంటి
రమాదేవి
కథ

పంచశిఖశాస్త్రి ఉలిక్కిపడి లేచాడు.

ఏకదంతం మహాకాయం తప్తకాంచన సన్నిభం
లంబోదరం విశాలాక్షం వందేహం గణనాయకమ్

మౌంజీ కృష్ణాజిన ధరం నాగయజ్ఞోపవీతనం
బాలేందు శకలం మౌళే వందేహం గణనాయకమ్

తండ్రి శివశంకరశాస్త్రి ప్రథమ పూజచేస్తున్నాడు గణనాయకుడికి.

మంచం మీదనుంచి గబుక్కున దిగాడు.

''ఈవాళ ఆలస్యమైపోయింది. ఇంకా నదికి వెళ్లాలి. ప్రాతఃస్నానం, సంధ్యాపూర్తిచేయాలి. అమ్మవారికి, శివుడికీ పూజ చెయ్యాలి'' గాభరాగా అనుకున్నాడు.

ముసలి వయస్సులో ఇవన్నీ చేయలేడు తండ్రి.

పెరట్లోకి వెళ్లి గూట్లో వుంచిన ఉత్తరేణి పుల్ల నములుతూ వంటింట్లోకి తొంగిచూశాడు.

మట్టిపొయ్యిమీద డాకలితో పాలు వెచ్చబెట్టడానికి ప్రయత్నిస్తోంది సరస్వతి.

బక్కచిక్కిన ఆవునుంచి ఎలా పాలు పిండుతుందోనని ఆశ్చర్యపోతూ వుంటాడు పంచశిఖశాస్త్రి.

సరస్వతి అతన్ని చూసింది.

''ఇంకా ఇక్కడే వున్నారా? మామగారు చూస్తే చంపేస్తారు... గుడి తెరవాలి మరిచిపోయారా?'' అంది.

రోజూ గుడి తెరుస్తూనే వుంటారు.

సోమవారంనాడు మాత్రం ఏడెనిమిది మంది వస్తారు.

మిగిలిన రోజుల్లో పంచముఖశాస్త్రి, ఆ దేముడూ ఎవరి లోకంలో వాళ్లుంటారు. ఎవ్వరూ రారు.

అపరాహ్ణపు వేళకు ఆకలి తప్పదుకదా.

ముతకబియ్యపు అన్నం, పాత చింతకాయ పచ్చడి, నీళ్ల మజ్జిగ, అప్పుడప్పుడూ ఏదో కూర.



సాయంత్రం చీకటి పడకముందే భోజనాలు.

చారు, నిప్పుల మీద కాల్చిన అప్పడం, కొంచెంగా పులిసిన మజ్జిగ.

అప్పుడు భోజనం చేసేది ఇద్దరే.

శివశంకరశాస్త్రి కొంచెం ఉప్పు నీళ్ల చిలకరించి రెండు పిష్టపుటుండలు తింటాడు.

కోడిగ్రుడ్డు దీపపు వెలుగులో పరస్వలి పాత వారపత్రిక దొరికితే అది చదువుతూ, కునికిపాట్లు

పడుతుంది.

పంచముఖ శాస్త్రి కిళ్లీబడ్డీ వాడి దగ్గర పాత పేపరు సగం రేటుకు కొని 'వాంటెడ్' కాలమ్స్ చూస్తూ వుంటాడు.

ఇంటర్మీడియెట్ మంచి మార్కులతోనే పాసయ్యాడు. గణితశాస్త్రమంటే ప్రాణం పంచముఖశాస్త్రికి. అలాగే తెలుగు, ఆంగ్లము. సైన్సులో ప్రథముడే, సోషల్‌స్టడీస్‌లో చాలా తక్కువ మార్కులు వచ్చాయి. నూటికి యాభై ఆరు. ఆఖరికి బి.కాంలో చేరి మంచి మార్కులే సాధించాడు.

శాస్త్రి పడక గదిలోకి చీకటి ధారాళంగా ప్రవేశిస్తుంది.

అప్పుడప్పుడు వెన్నెల. పగలు సూర్యుడు చుట్టం. చీకట్లో ఏదో చప్పుడవుతూ వుంటుంది.

కోడిగుడ్డు దీపం పెద్దది చేసి చూస్తారు ... ఆ దంపతులు.

ఎర్రతేలు బొద్దింకతో యుద్ధం చేస్తూ వుంటుంది. ఆ దృశ్యం చూ[illegible] 'కోడి కోడి'' అవి దాన్ని పాత టైరు చెప్పుతో చంపేస్తారు. ఇది దినచర్య కాకపోయినా సరాసరిన నెలకోరోజు తప్పదు.

బొల్లకొంపల్లో, తేళ్లు, రోకటి బండలు, గాజు పురుగులూ వాళ్లతో సహజీవనం చేస్తుంటాయి.

సంవత్సరంలో ఏదో ఒకరోజు, ఒకొంటె తేలు సరస్వతినో శాస్త్రినో అంట పొడుస్తుంది.

కుంకుడు గింజ సగంగొట్టి, తమలపాకుతో (సాధారణంగా ఎండిపోయి వుంటాయి - గూట్లో) చుట్టి తింటారు.

పంచదార నీళ్లు తాగి పడుకుంటారు. తెల్లారేసరికి మామూలుగా అవుతారు.

గుడికి శివరాత్రివాడు జనం బాగా వస్తారు. ఆ రోజుల్లో సరస్వతి పాలకాయలు, పూలదండలూ అమ్మి చేస్తుంది. అప్పుడప్పుడు ఆవుకు మేత దొరుకుతుంది. పాత బియ్యపు నూకలూ, తవుడూ... అది ఏదీ దాచుకోదు. అప్పుడు పరమాన్నం చేస్తుంది. అదిచ్చిన పాలతో.

మణిదీపపు ఛాయ సరస్వతిది పేదరికం, పోషణా రాహిత్యంవల్ల కళ్లకింద నల్లచారలు వచ్చాయి. జుట్టు ఎర్రబడుతోంది.

సరస్వతి వయస్సు పద్దెనిమిది.

పంచముఖశాస్త్రి వయస్సు ఇరవై ఒకటి.

పంచముఖశాస్త్రి కాలేజీలో చేరడం శివశంకరశాస్త్రికి ఇష్టంలేదు.

''అందరూ ఉద్యోగాలకు పోతే, నిత్య నైమిత్తికాలు, పంచాగ్నిహోత్రాలు, వేదవిధులు ఎవరు చేస్తారు?

కాని దానికి అంగలార్చడం ఎందుకు? శివుడు - నువ్వు - ఈ ఇల్లు - దీనికానుకున్న పెరడూ, దాంట్లో పది కొబ్బరిచెట్లు, అరటి పిలకలూ - ఇవి చాలవా? శివుడు దయతో తిండికీ, బట్టకీ లోటు లేదుకదా'' అన్నాడాయన. ఆయనకి తెలిసీ, తెలియక కాలేజీలో చదువయిపోయింది. అంతే.

ఊరందరికీ, ఆఖరికి శివుడు గుడికే కరెంటు వుంది.

ఆ ఇంట్లో లేదు... కరెంటు.

పాకటిళ్లు, పెంకుటిళ్లుగా మారుతున్నాయి.

పెంకుటిళ్లు డాబాలుగా - డాబాలు కాంప్లెక్సులుగా మారుతున్నాయి.

అయినా ఆ ఇల్లు మారలేదు. అదే పాత ఇల్లు. పాత మనుషులు.

తండ్రికి తెలియకుండా ఉద్యోగాలకు అప్లయ్ చేశాడు పంచముఖశాస్త్రి.

ఇంటర్వ్యూలకు కాల్ వచ్చింది ఓసారి.

మురికి ఇద్దరు పంచె, మోచేతులవరకు 'ఆఫ్' పంచటి జుట్టూ, పిలకా చూసి ఇంటర్వ్యూ చేసేవాళ్లు విచిత్రంగా చూసేరు శాస్త్రిని.

షార్టుహ్యాండ్, టైపు మొదటి ప్రయత్నంలో సాధించాడు. లెక్కల్లో సూక్ష్మగ్రాహి. తెలుగులో డొక్కశుద్ధి వున్నవాడు. స్వచ్ఛమైన ఇంగ్లీషు వ్రాయగల నేర్పరి... అయితే ఆ పిలకేమిటీ - గుండేమిటీ, ఆఫీసులో మిగిలినవాళ్ల మొరేల్ దెబ్బతినదూ - అతనికి ఉద్యోగం రాలేదు.

శాస్త్రిది విచిత్ర పరిస్థితి.

ఉద్యోగం వస్తే ఎలా?

తండ్రి ఒప్పుకుంటాడా?

ఎదిరించవచ్చు.

సరస్వతితో వేరే వూరు వెళ్లవచ్చు.

జంగమదేవర, బూడిద పూతలరాయుడు, నాగభూషణుడు శివుడిని నమ్ముకుంటే అంతే - బూడిద తప్ప ఏముంది?

గబుక్కున చెంపలు వాయించుకుంటాడు శాస్త్రి.

''స్వామీ క్షమించు. అపరాధం అపరాధం'' అనుకుంటాడు.

రాగిచెంబు తీసుకుని అలవాటైన అడ్డదారిలో నదికి బయలుదేరాడు. ఆలోచనలు తనతో తీసుకుపోతూ.

వేగుచుక్క కనుమరుగవుతూ వుంది.

నదిలో దిగాడు పంచముఖ శాస్త్రి.

నీటి ఉపరితలం మంచులా చల్లగా వుంది.

''ఓం హరహరా'' అంటూ నీటిలో దిగాడు.

చల్లటి నీరు శరీరాన్ని ఎలక్ట్రిక్ షాక్‌లా తాకింది. ఒక క్షణం లోపలి నీరు వెచ్చగా వుంది.

నీరు మెల్లిగా శరీరాన్ని తాకుతూ వుంటే ఆలోచనలో పడ్డాడు శాస్త్రి-

''ఎన్నాళ్లిలా? కాలే కడుపుతో, కన్నీళ్ల తన్నుకువస్తున్నా ''స్వామి సేవ'' అని ఆత్మవంచన ఎన్నాళ్లు? తన తోటివాళ్లు ఏదో పనిచేసుకుంటూ హాయిగా వున్నారే. తనకీ పెళ్లేమిటి? ఇరవై ఏళ్లకే సరస్వతీ పదివరకు చదివింది. అదీ అంతే - ఇదే లోకం అనుకుంటుందా? సరస్వతి కొలనులో పద్మంలా అందంగా వుంటుంది. చక్కటి దేహచ్ఛాయ, దేవతా స్త్రీల ముఖ కవళికలు, సంపంగి రంగులో వుండే ఆ చిరు నడుము. ఘనమైన వక్ష సౌందర్యం

ఎందుకూ? అడవికాచిన వెన్నెల. ఎండిన మానులాటి తనకు, మాధవీలత చుట్టుకున్నట్టు దిగులూ, భయమూ తప్ప ముద్దూ ముచ్చటా ఏవీ?



## పాతనీరు

అనేక విజయవంతమైన చిత్రాలలో నటించి, మంచి నటిగా హీరోయిన్‌గా గ్లామర్ తారగా ఓ వెలుగు వెలిగిన తెలుగు తారలు చూస్తూ చూస్తూండగానే తెర మరుగు అయిపోతున్నారు. కారణాలు తెలియవు. వాణీ విశ్వనాథ్, నిరోషా, భానుప్రియ, కుష్బూ, అనూరాధ, దివ్యవాణి, ఇలా ఎందరో ఎంతో మంచి టాలెంట్ ఉన్న తెలుగు చలనచిత్ర పరిశ్రమ విస్మరిస్తోంది. కొత్త నీరు వస్తుంటే పాతనీరు **పోతూ వుంటుంది''** అంటారు కొందరు. కానీ ఇది సరైనది కాదు.

**సుబ్బారావు**

పైనుంచి తేలో, జర్రో పడుతుందని భయంతో పడుకునుంటే ఇంకేం శృంగారం?

సరస్వతికి కొత్త కాబట్టి ఇలా వుందా?

తన అసమర్థతా, పెరిగే అవసరాలు, చుట్టూ వుండే లోకం, సరస్వతిని మార్చేస్తాయా? క్రమంగా గయ్యాళిలా, కొరకరాని కొయ్యిగా, నిత్యం వేధించి, సాధించి, మధ్యతరగతివాడి పెళ్లాంలా తయారవుతుందా?'

అనాలోచితంగా, అసంకల్పితంగా స్నానం పూర్తయింది.

గట్టున వుంచిన తువ్వాలుతో వంటినున్న తడిని తుడుచుకుని గట్టుపైకి వచ్చాడు.

పుప్పొడిలాంటి వండ్రుమన్ను తడి తగిలిన కాలి చుట్టూ అంటుకుంది.

కొబ్బరి తోటలో దబ్బుమన్న శబ్దమయింది.

పండిన కాయ రాలి వుంటుంది అనుకున్నాడు.

కాలి బాట ప్రక్కన పడిన కొబ్బరి ఆకు తప్పించి నడుస్తుంటే కనిపించింది.

పండిన కొబ్బరికాయ.-

అధమపక్షం ఐదు రూపాయలు.

తనూ, సరస్వతి మంచి పాలతో, తండ్రికి తెలియకుండా కాఫీ తాగొచ్చు.

''ఛ.. ఛ... ఏమిటీ చపల బుద్ధి...'' అని మనసు హెచ్చరిస్తున్నా శరీరం మాట వినలేదు.

ఎర్రటి ఎరుపు రంగు కొబ్బరికాయ!

చిన్న పనసకాయంత వుంది!!

అప్రయత్నంగానే ఇల్లు చేరుకున్నాడు.

చేతిలో కొబ్బరికాయ సరస్వతికిచ్చి ''దొరికింది'' అన్నాడు. సరస్వతి ఆ కాయ తీసుకోకుండానే అంది.

''రాగి చెంబు ఏదీ?''

ఉలిక్కిపడ్డాడు పంచముఖశాస్త్రి.

''ఏదీ ఎక్కడ వదిలాడు? గట్టుమీదా? నీటి ప్రక్కనా? ఎక్కడ?''

ఎక్కడో గుర్తుకు రాలేదు.

''అయ్యయ్యో బంగారంలాంటి చెంబు - ఇప్పుడు ఓ వందయితేగాని రాదు - మీకింత మందమరుపేమిటండీ. వెళ్లి చూడండి''

''గుడి తెరవాలిగా''

''దిక్కుమాలిన గుడి - ఎవరయినా వస్తారా? చస్తారా?

ఆ స్వామికి మీరు - మీకు ఆ స్వామి - జోగీ జోగీ రాసుకుంటే బూడిదేగా రాలేది''

అప్రతిభుడైపోయి చూశాడు.

సరస్వతేనా ఇలా మాట్లాడుతున్నది. తన ఊహ నిజం కాబోతోందా?

ఆర్థిక చింతతో మనిషి తన సంయమనాన్ని, నిగ్రహాన్ని, పరిసరాల్ని మరచిపోతాడా?

మరి సరస్వతి -

ఈమె మొదటినుంచి ఇంతేనేమో ఇన్నాళ్లూ మౌనంగా అన్నీ చూసి ఈ రోజుకు అంధకారంలాంటి యదార్థం ఆమెకు గోచరించి వుండవచ్చు.

శాస్త్రి ఒకందుకు సంతోషించాడు.

తన జీవితంలో ఇదో మార్పు. నిజంగా మార్పా?

తండ్రి ఆజ్ఞలలోనుంచి, భార్య అదుపాజ్ఞలలోకి

మార్పుకాని మార్పు.

గబగబా ఇల్లు వదిలాడు.

భళ్లున తెల్లవారింది. జనం తిరుగుతున్నారు.

ఏటి గట్టున వెదుకుతుంటే పొలాలకి ఏతం పడుతున్న నాగేశ్వర్రావడిగాడు.

''పంతులుగారూ ఏటి ఎతుకుతున్నారు?''

నాగేశ్వరరావు ఎనిమిదో తరగతివరకు తనతో చదువుకున్నాడు.

తర్వాత చదువు మానేసి వ్యవసాయం చూసుకుంటున్నాడు. తనలాగే చిన్నప్పుడే పెళ్లయింది. భార్య ఇంటి దగ్గర చిల్లర దుకాణం నడుపుతూ వుంది.

సాయంత్రాలయ్యేసరికి ఇద్దరూ శుభ్రంగా తయారై బజారుకొస్తారు. తోచనప్పుడెప్పుడైనా గుడికొస్తుంటారు.

తనూ అతనిలాగే పని నేర్చుకుంటే బాగుండేది. చిల్లర దుకాణమైనా ఫర్వాలేదు.

''నా రాగిచెంబు పోయింది. ఇక్కడే ఎక్కడో పెట్టాను''

''ఇంకెక్కడుంటుందండీ బాబు ఎవరో అట్టికెళ్లి, ఇడ్లీ కొనుక్కుని తినేసుంటాడు. రావిచెట్టుకింద ఓటల్లో'' నవ్వాడు.

శాస్త్రి నిరాశగా తిరిగొచ్చాడు.

సరస్వతి గుడి తెరిచింది.

పాత పూలు, అగరువత్తీ తాలూకు ముక్కలు తీసి శుభ్రం చేసింది.


లోపల శివశంకరశాస్త్రి, దుఃఖ నివాశన దళిత మనోహర చందన లేపిత చరణ శివ - సాంబ సదాశివ సాంబ సదాశివ సాం సదాశివ సాంబశివా - అని పాడుకుంటున్నాడు. అమృతం తాగిన తృప్తి వుంది ఆయన గొంతులో.

యథావిధిగా పూజ ముగించాడు పంచముఖశాస్త్రి. సరస్వతి తెచ్చిన బలి అన్నం అన్ని మూలలా పెట్టి శివుడ్నిమనసులో ధ్యానించుకున్నాడు. ''ఆశోపహతుడ్నయి కొబ్బరికాయ దొంగిలించాను. రాగిచెంబు తీసేసుకున్నావు. నాకు మాత్రమే ఎందుకీ తక్షణ శిక్ష. ఆయువుతీరిన తర్వాత చిత్రగుప్తుడు ఎలాగూ పట్టుకుంటాడుకదా? శివా... పట్టెడు మెతుకులు దొరికే మార్గం చెప్పవా?'' మనసులోనే ధ్యానించుకున్నాడు శాస్త్రి.

''ఇక మనకి ఉద్యోగం దొరకదండీ - మనకీగుడీ, ఈ నాలుగు పీరికల పెరడు - మండిపోయే ధరలతో ఎలా గడుస్తుందో - ఇంకా ఇద్దరమే - ముందు ముందు '' సరస్వతి అంటోంది. పాత పేపరులో హెడ్‌లైన్స్ చూస్తూ.

ఆలోచనలనుండి తేరుకున్న శాస్త్రి అన్నాడు.

''ఎందుకు దొరకదు. చక్కగా డిక్టేషను తీసుకోగలను. అకౌంట్లు రాయగలను. టైపు చెయ్యగలను''



''మీకేకాదు. మీలాంటి వాళ్లకు చాలామందికి దొరకదు''

''మరీ అంత నిరాశపడకు''

''ఎందుకు పడకూడదు. నిన్నటి పేపర్లో చూడండి. అరవైశాతంనుంచి అరవై ఎనిమిది శాతం జనాభా ప్రాతిపదికన తమ కులాలకు రిజర్వేషను కల్పించాలని ఒకాయన ఢంకా బజాయిస్తుంటే, ఇంకొకాయన తమ కులాన్ని వెనుకబడ్డ తరగతిగా గుర్తించేవరకు ఆమరణ నిరాహారదీక్ష కొనసాగిస్తున్నాడు. ఇంక మననెవరు చూస్తారు?

శాస్త్రి నిట్టూర్చి అన్నాడు.

''మనకి మనమే సానుభూతి చూపుకోనక్కర్లేదు. ఇంకా ఇతర కులాలవారు వున్నారు. వాళ్ల పిల్లలూ నాలాగే చాలీ చాలని చదువులతో అవస్థ పడడంలేదూ''

సరస్వతి స్వరం పెంచి అంది.

''మీరూ నెట్టండి రిక్షా... పట్టండి నాగలి...''

''అప్పుడు ఎలా వుంటుందో చూడండి. ఇకమీదట మనలాంటి వాళ్లకు ఉద్యోగం దొరకదు. ఇలా దిగజారి దిగజారి, నికృష్టంగా మారిన తర్వాతయినా ఈ ప్రభుత్వానికి మనమీద కసి తగ్గుతుందేమో''

''మనమీద కసెందుకుంటుంది? ఇంకేదో వుంటుంది మనకి సహాయం చెయ్యాలంటే...''

మధ్యాహ్నం అయింది.

గుడితలుపు మూసేశాడు శాస్త్రి. వంటింట్లో అప్పటికే కూర్చుని వున్నాడు శివశంకరశాస్త్రి.

''అన్నపూర్ణే - సదాపూర్ణే - కాశికావాసినే'' అని చదువుకుంటూ పెరట్లోనుంచి క్రిందగా వంగిన అరటిచెట్టునుంచి రెండు ఆకులు కోసి తెచ్చివేసింది సరస్వతి.

ఒకటి శివశంకరశాస్త్రికి

ఇంకోటి పంచముఖశాస్త్రికి

పొయ్యిమీదనుంచి గిన్నె దించుతుంటే అన్నాడు శివశంకరశాస్త్రి.

''బ్రాహ్మణీకం పాడైపోవడానికి కారణం దురాశేరా! లక్షాధికారులు కావాలని నానా ఛండాలప్పనులూ చేస్తున్నారు. వీళ్లు ధనవంతులు కాలేర్రా ఎన్ని జన్మలెత్తినా - భృగుమహర్షిని లక్ష్మీదేవి శపించలేదూ - ఆ శాపం ఊరికే పోతుందా - లక్ష్మీఅమ్మవారి నివాస స్థానమైన శ్రీ మహా విష్ణువు వక్షభాగాన్ని తన్నేడే ఆ భృగువు. ఆ తల్లి కోపగించి ఏమంది? ''నేను మీ ఇళ్లల్లో వుండనంది. అందుకే మన జీవితాలు దైవచింతనలో గడవాల్సిందే - పూట గడిచినా గడవకపోయినా మనం ధనవంతులూ, షావుకార్లూ కాలేము. ససేమిరా అంతే''

ఆయన మాటలు ఎవరూ వినడంలేదు.

మౌనంగా తిని బయటకు వచ్చాడు పంచముఖశాస్త్రి. పడక గదిలో పాత పట్టెమంచంమీద మేనువాల్చాడు. సూర్యరశ్మి మంచంమీద, కరిగించిన ఇనుప ఊచల్లా పడుతోంది.

క్రమంగా అతని కళ్లు మూతపడుతున్నాయి.

ఉలిక్కిపడి లేచాడు.

''భ్రష్టుడు ఎంత పని చేశాడు. అక్షయపాత్రలాటి రాగిచెంబు గంగపాలు చేశాడా? హరహరా - శివశివా - ఈ కొంపకేదో అరిష్టం చుట్టుకుంది'' ముసలాయన కఠోరమైన పదజాలం.

మంచం దిగాడు. ఊరంతా వెలుగులతోనిండి వుంది.

తనింట్లో చీకటి...

గబగబా బయటకు వచ్చాడు. ఎక్కడికో ముందు అనుకుని నడక మొదలుపెట్టలేదు.

అనుకోని గమ్యం చూసి ఆనందపడనూ లేదు. ఆశ్చర్యపడనూ లేదు. ఆ ఇంటికి దూరంగా వెళ్లాలి - అంతే అలవాటైన ప్రదేశం, నదీతీరం.

చీకట్లో కొబ్బరిచెట్లు ఫ్యాక్టరీ గొట్టాల్లా నిలబడి వున్నాయి. మహాసర్పం వాసుకి ఊపిరి తీస్తూ విడుస్తున్నట్లు, నదీ ప్రవాహపు హోరు.

చీకటి వెలుగులలో నీటి కెరటాల ప్రకాశ వక్రీ భవనాలు, పాము వంటిపై ఉచ్ఛ్వాస నిశ్వాసాలకనుగుణంగా మారుతున్నట్లు లేచి పడుతున్నాయి. మచ్చలు మచ్చలుగా హఠాత్తుగా శాస్త్రి ఫెళ్లుమని అరిచి, గొంతు పగిలేలా, గుండె పేలేలా క్రీంకార రావం చేశాడు.

ఆనకట్ట తెగిన మహానది ప్రవాహంలా!

''దేముడా నేనేం చేయను - ఏదీ నా రాగిచెంబు''

నిశ్శబ్దం - ఉరుము ఉరిమిన తర్వాత వినిపించే శబ్దం. హ్రస్వ శబ్దాలన్నిటినీ మహాశబ్దం తనలో లయం చేసుకున్నట్టు.

ఊరు వెలుగు కోల్పోయి చీకటిలోకి జారుకుంటూ వుంది.

మరో వెల్లువలాటి దుఃఖం... నిర్ఘర ఝురీలాటి ఆ ఘోష వినే మానవుడే లేడక్కడ.

చిత్రం...

మెరుపు తర్వాత, ఉరుము - తర్వాత తుఫారా బందుపాతంలాంటి వాన... ఆ వానలో ఎన్నోవమాటలు - జాగ్రత్తగా విన్నాడు పంచముఖశాస్త్రి. ''బిడ్డా - ఇదేనా నీ చెంబు'' అన్న మాటలు నదిలోంచి వినబడ్డాయి.

నదిలో ఒక పరిమిత ప్రాంతంలో కాంతి - ఆ కాంతిలో దగద్ధాయమానంగా మెరుస్తూ రత్నపోచిత సువర్ణ కలశం. శాస్త్రి నిరాశగా చూసి అన్నాడు

''నీవెవరో పరిహసిస్తున్నావు. నాది ఇదికాదు'' అన్నాడు.

''ఇది చూడు శిశువా'' అన్నమాటలు మరలా వినబడ్డాయి.

పరిహృతమైన కాంతి పుంజంలో, చంద్రబింబంలా మెరిసిపోతూ రజిత కుంభం.

''ఇదీ కాదు నాది... అప్పుడే గుర్తుకువచ్చింది చిన్నప్పుడు చదివిన కథ. కట్టెలు కొట్టేవాడి కథలో ఇలాగే జరుగుతుంది. కాని వాడేం చేశాడు? ఇప్పుడు వాడుంటే ఏం చేసేవాడు? రత్నాలతో పొదిగిన బంగారు చెంబు తీసుకుని తన దరిద్రాన్ని వదిలించుకునేవాడా? ఈసారి సాధారణ కాంతిలో సొట్టలుపడి రంగువెలిసిన తన రాగిచెంబు. అప్రయత్నంగా సంబరంగా, అరిచాడు శాస్త్రి. ''ఆదే... అదే...''

## బ్రహ్మచారి

ఒక ప్రొఫెసర్‌గారు క్లాసులో ఓ స్టూడెంట్‌ను అడిగారు.

''జాన్ మిల్టన్ గురించి నీకు తెలిసినదేమిటో చెప్పు''

''మిల్టన్‌గారు పెళ్లిచేసుకున్న తరువాత పారడైజ్ లాస్ట్ వ్రాశారు. కొన్నాళ్లకు ఆయన భార్య చనిపోయింది. ఆటు పిమ్మట మిల్టన్ పారడైజ్ రీగైన్డ్ వ్రాశారు'' అన్నాడు స్టూడెంట్.

ఆది విని ప్రొఫెసర్ నవ్వాడు. ఆయనొక బ్రహ్మచారి.

''నేను నీకు కృతజ్ఞుణ్ణి. నేనింతవరకూ స్వర్గాన్ని పోగొట్టుకోలేదన్న సంగతిని నువ్వు నాకు జ్ఞాపకం చేశావు!'' అన్నాడు.

- కొడిమెల



''వత్సా! నీ నిజాయితీకి మెచ్చాను. ఈ మూడూ నువ్వే తీసుకో'' అని దివ్యవాణి ఆగిపోయింది.

''నిజాయితీనా? తనకా? ఉదయం కొబ్బరికాయ ఎలా దొంగిలించాడు? తికమకపడి ఆ చెంబులు వద్దన్నాడుకాని ''అన్నీ మన మేలుకే - పలుకే బంగారమంటారు - మందబుద్ధి బంగారం, వెండి రాగిచెంబులతో సమానమా''

ఆలోచనలు ఆపేసి ఆ మూడు చెంబులు తీసుకుని సంబరంగా ఇంటికి బయలుదేరాడు. సరస్వతి ఈ విలువైన చెంబులు చూసి ఎంతో సంబరపడుతుంది. తన కష్టాలు తీరిపోతాయి. వీటితో దిగులు లేకుండా రోజులు గడిచిపోతాయి అనుకుంటూ. సరస్వతి గుమ్మంలోనే కూచుని వుంది.

''ఇంతసేపు ఎక్కడికెళ్లారోనని భయపడ్డాను.'' కంగారు తగ్గి అంది. పంచముఖశాస్త్రి జరిగిందంతా చెప్పడు. ఆమె సంతోషించలేదు.

''పెద్ద నిర్వాకమే చేసుకొచ్చారు. పెద్ద లక్కపిడతలంత మూడు చెంబులు తెస్తారా? ఎంత బంగారమైతే మాత్రం పెద్ద గంగాళం పడిపోయిందని ఏడవకపోయారా అంది రుసరుసలాడుతూ. అప్రతిభుడై చూశాడు ఆమెని. సరస్వతి ఏమంటోంది. జీవితానికి ఇవి చాలవా?

మీకేం తెలియదు. నడవండి నేను వస్తాను'' అంది.

''ఎక్కడకి'' అడిగాడు శాస్త్రి.

''నదికి. మన పెద్ద అడ్డగిన్నె తెస్తాను'' అంది.

సరస్వతి ఎంతో బరువుగా అన్న ఆ మాటలు అతనికి నవ్వు తెప్పించాయి.

కోపంగా అంది ఆమె ''మీకు నవ్వుగా వుందా. మీలాంటి చచ్చు దద్దమ్మకి ఇంతకంటే ఏమి చేతనవుతుంది?''

విద్యుద్ఘాతం తిన్నవాడిలా మ్రాన్పడిపోయాడు శాస్త్రి.

ఆ అర్ధరాత్రి ఇద్దరూ జంట పిశాచాల్లా నదీతీరం చేరుకున్నారు.

''నేను ఈ గిన్నె పడేస్తాను. ఇందాక ఎలా ఏడ్చారో అలాగే ఏడవండి'' అని ఆ గిన్నె నదిలోకి విసిరేసింది.

అప్పుడు అనుకోని సంఘటన జరిపోయింది.

విసిరిన గిన్నె నీటికి తగలగానే ఎగిరి నేలమీదకు తిరిగి వచ్చింది. విసిరిన వ్యక్తి నీటిలో పడిపోయింది.

దిగ్భ్రమతో ఒక్కసారి అరిచాడు. ''సరస్వతీ'' ఆ అరుపుకి చెట్లమీద నిద్రిస్తున్న పక్షులు కకావికలై అరుస్తూ పారిపోయాయి. ప్రశాంతంగా వున్న నది అల్లకల్లోలమైపోయింది.

నిశ్శబ్దం - దుర్భర కఠోర శబ్దభూయిష్టమైపోయింది.

సరస్వతి నీటిపాలయిపోయింది.

కొద్ది క్షణాలలో తిరిగి ప్రశాంతత నెలకొంది.

''కువరాా! ఏమిటి మళ్లీ వచ్చావు'' అశరీరవాణి మళ్లీ ప్రశ్నించింది.

''నా భార్య సరస్వతి ఏటిపాలయిపోయింది.

''భయపడకు ఇప్పుడే నీ భార్యను నీకిస్తాను'' అని వినబడింది.

భయంతో ఒక్కడుగు వెనక్కి వేశాడు శాస్త్రి.

ఆమె అందవికారంగా వుంది! ఎండిన కంపంలా వుంది!!! లోతుకుపోయిన కళ్లు, ఎత్తు పళ్లు - ఆకృతిలేని జీర్ణవృక్షపు శాఖలా వుంది!!

''ఎవర్నువ్వు'' శాస్త్రి అడిగాడు.

ఆమె చెప్పింది...

శాస్త్రి గబుక్కున చెప్పాడు.

''ఈమే నా తప్పిపోయిన భార్య - కృతజ్ఞుడిని స్వామీ''

ఆమె చెయ్యి పట్టుకున్నాడు శాస్త్రి.

ఆకాశంలో ఉరుము ఉరిమింది.

''మూర్ఖుడా ఏమైందిరా నీ నిజాయితీ - తాళికట్టిన ఇల్లాలిని నీటిపాలుచేసి ఈకలు ఊడిన కాకిలాంటిది కావల్సి వచ్చిందా నీకు?''

శాస్త్రి భయపడలేదు.

''ఓ అశీరరవాణీ - నీవెవరో నేను గుర్తించాను. ధరాధరేంద్ర నందినీ విలాసబంధ బంధురా? దిగదిగ్గంత సంతతికి ప్రమోదకారకుడా - శివా! నువ్వేకదా ఈ నాటకమాడిస్తున్నది''

''అర్థమైంది నీ మనసు. ముందు ఈ అనాకారిని చూపించి, తరువాత మరొక అందగత్తెను చూపించి, ఆ తర్వాత నీ భార్యను చూపించి, మూడుచెంబులవలె ఈ ముగ్గురినీ ఏలుకొనుమని ఆజ్ఞాపిస్తానని భయపడ్డావా?''

''సర్వమంగళా కళా కదంబమంజరీ - సర్వజ్ఞుడివి - నా మనసులో మాట నీకెరుకే... గృహస్తుబాధ్యతలున్నవాడిని - కడుపునింపే పనేలేదు. నా తండ్రిలా నేనుండలేను. ఆ రోజులు, కాలము వేరు. జీవజ్యోతి వుంటేనేకదా ఏ సేవలైనా - పుట్టెడు దుఃఖంతో నేను తీసుకున్న నిర్ణయం. నా మనసును కఠోరపాషాణంలా మార్చుకుని అంటున్న మాటలివి. ఈమే నా భార్య - అని.

ఈమె అనాకారే కావచ్చు. ఆమె మాటలనిబట్టి ఈమెకు ప్రభుత్వోద్యోగం వున్నదని తెలిసింది. నాకదిచాలు. నిశ్చింతగా భుక్తిగడిచిపోతుంది. నాకా మరెందరివలెనే ఏ ఉద్యోగమూ రాదు. కాయకష్టం అలవాటులేనివాడిని. నా మానసిక దారుఢ్యాన్ని ఎవరూ గుర్తించలేదు. గబ్బిలాలు నిండిన చీకటి గుహలాంటి, ఈ అగ్రవర్ణపు నికృష్ట గృహంలో, పైనుంచి తేళ్లు, కిందినుంచి మూషికాదులూ - ఇక ఈ జన్మలకు నిష్కృతి లేదు.

కొన్ని క్షణాల నిశ్శబ్దం తర్వాత -

''అజ్ఞానీ నీకు ఇచ్చిన స్వర్ణ కలశమూ, రజత కలశమూ తిరిగి తీసుకుంటున్నాను. నీకు ఆ పాత రాగిచెంబు తప్ప వేరే వస్తువులు పొందే అర్హత లేదు...''

''మరి సరస్వతీ''

మరిక అశరీరవాణి పలకలేదు.

దూరంగా ఏవో మాటలు

''ఏమండీ లేవండీ - అసలు సంధ్యవేళ ఏమిటీ నిద్ర''

నెమ్మదిగా కళ్లు తెరిచాడు శాస్త్రి.

నిప్పుకణికలా మండుతున్నాయి ఆ కళ్లు.

''మన రాగిచెంబు నూతి చప్టాకి అవతలవేపు కనిపించింది. కొబ్బరికాయ ఇంట్లోకి తెస్తూ అది అక్కడ పెట్టి మరచిపోయినట్టున్నారు''

శాస్త్రికి ఆనందం కలగలేదు.

''అది రేపు ఏట్లో పడేస్తాలే'' అన్నాడు.

విచిత్రంగా చూసింది ఆమె. ఆమెకు అర్థంకాలేదు.

''గోష్పదంలాంటి పిలకలోని వెంట్రుకలు మిగిలిన జుట్టులో కలుస్తాయి''

ఆమెకు అర్థంకాలేదు ఇదికూడా.

''శివుడి ఆజ్ఞ అయింది. మసి పారినా దీపం చుట్టూ, గాజుగోళం వుండాలని''

ఇదీ అర్థంకాలేదు ఆమెక. అయోమయంగా చూసిందతనివైపు.

పనికిరాని రాగిచెంబు అక్కరకు రాని జీవనసరళి అది నీటిపాలు కావలసినదే.

ఏమాత్రం ప్రత్యేకత లేకుండా పిలక మిగిలిన జుట్టులో కలిసిపోతుంది.

శాస్త్రి జనంలో కలుస్తాడు.

దైనందిన జీవితంలో మసిపారుతుంది ఆత్మజ్యోతి.

తుఫాను గాలికి ఆరిపోకుండా కాపాడుతుంది గాజుచిమ్నీ. అదే మలినమవుతున్నా.